క్లుప్తంగా

హైబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కేసముద్రం: హనుమకొండ జిల్లా పెంబర్తిలో ఈనెల 4నుంచి 6వరకు తెలంగాణ హైబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి హైబాల్ పోటీల్లో కేసముద్రంవిలేజ్‌లోని శ్రీవివేకవర్ధిని హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు. రాష్ట్ర బాలుర జట్టు తరఫున ఆదర్శ్, అయ్యప్ప, యశ్వంత్, అజయ్‌లు పాల్గొని ప్రథమస్థానంలో నిలిచారని, రాష్ట్ర బాలికల జట్టు తరఫున మంజుల సారథ్యంలో ఐశ్వర్య, సింధూ, రాజేశ్వరీ తృతీయస్థానంలో నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిర్ర నరేష్, పీఈటీ డెక్క లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెండి హారతి పళ్లెం బహూకరణ



కురవి: మండల కేంద్రంలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామికి జిల్లా కేంద్రానికి చెందిన భక్తులు గోన శ్యామ్‌రావు–సునీత దంపతులు వారి కుమారుడు గోన సాకేత్‌రావు జ్ఞాపకార్థం రూ.15,500 విలువైన వెండి హారతి పళ్లెం, గంటను సోమవారం అర్చకులకు అందజేశారు.

నూతన కమిటీ ఎన్నిక



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలో తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నాన్ టీచింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుమ్మడి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్ది కోల శిరీష, కోశాధికారి సోయం రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బంజారాలను గుర్తించింది ప్రధాని మోదీనే



దంతాలపల్లి: దేశ వంద సంవత్సరాల చరిత్రలో బంజారాలను గుర్తించింది ప్రధాని మోదీనే అని మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతారాంనాయక్ మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడవర్గానికి చెందిన మంత్రి ఒక్కరు కూడా లేరన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సేవాలాల్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భుక్య సంగీత, మహేష్, అల్లం సాయికుమార్ పాల్గొన్నారు.

కల్వర్టు రోడ్డు ధ్వంసం

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న రైతులు



ధ్వంసమైన కల్వర్టు

కురవి: గత నెలలో కురిసిన భారీ వర్షాలకు సీరోలు మండలం ఉప్పరిగూడెం శివారు నుంచి చిలుకోడు శివారు తెల్లబండ తండా జీపీ వరకు నిర్మించిన బీటీ రోడ్డుపై కల్వర్టు ధ్వంసమైంది. ఉప్పరిగూడెం-తెల్లబండతండా గ్రామాల మధ్య రాకపోకలు జరిగేందుకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ రూ.2.10కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఈ మార్గంలో కల్వర్టును నిర్మించారు. భారీవర్షాలకు ఉప్పరిగూడెం చెరువుల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీటితో కల్వర్టు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ద్విచక్రవాహనాలు మాత్రం కష్టంగా కల్వర్టును దాటుతున్నాయి. నాలుగు చక్రాలవాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతంలో రెండు గ్రామాలకు చెందిన రైతులు తమ పంటపొలాలకు నిత్యం నడిచి వెళ్లడం తోపాటు, ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లు వెళ్తుంటాయి. కల్వర్టును దాటాలంటే నానా కష్టమవుతుంది. కల్వర్టు చివరలో పెద్దగుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయంలో ప్రయాణం చేసే వాహనాలు గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గం ద్వారా డోర్నకల్ మండలంలోని పలుగ్రామాలకు, డోర్నకల్‌కు సైతం జనం వెళ్తుంటారు. అధికారులు స్పందించి వెంటనే కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి ప్రజలు, రైతులకు, వాహనదారుల ఇబ్బందులు తీర్చాలని వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేయాలి



ఉప్పరిగూడెం–చిలుకోడు శివారు తెల్లబండా తండా జీపీ పరిధిలోని కల్వర్టు వానలకు దెబ్బతిన్నది. కల్వర్టు లేకపోవడంతో నడవడం ఇబ్బందిగా ఉంది. చేలకు, చెరువుల వద్దకు వెళ్లాలంటే భయంగా ఉంది. వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేయాలి.

– కొప్పెర రామన్న, రైతు, ఉప్పరిగూడెం

ప్రజలకు ఇచ్చిన హామీలు పక్కదారి



మహబూబాబాద్ రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న గునిగంటి రాజన్న

మహబూబాబాద్ రూరల్: ప్రజలకిచ్చిన హామీలను పక్కదారిపట్టించే విధంగా ప్రభుత్వ పాలన ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజన్న విమర్శించారు. మండలంలోని కంబాలపల్లి దుబ్బతండా సీపీఎం శాఖ మహాసభలు అమరజీవి గుర్రాల మల్లారెడ్డి ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో రాజన్న మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు, పోడు రైతులకు బ్యాంకు రుణాలు, కొబాలపల్లి 186 సర్వే నంబర్‌లో రైతులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. నూతన శాఖ కార్యదర్శిగా పోరెడ్డి వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా శేషం ప్రశాంత్, దుబ్బతండా కార్యదర్శిగా పెద్ద శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గుర్రాల పద్మక్క, ధరావత్ బాలు, కుర్ర మహేష్, రామ్మూర్తి, రవీందర్, వినోద్, యానాల ఎర్రయ్య, రమేశ్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న అన్నారు. సోమవారం తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెద్ద లింగన్న, అనిల్, సాయిలు, సంపత్, శ్రీను పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సీతారాంనాయక్ అన్నారు. పార్టీ షికార్‌ఖానగడ్డ శాఖ మహాసభ తోట యాకయ్య అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



మరిపెడ రూరల్: నరేశ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

మరిపెడ రూరల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ నాయకులు నూకల నరేశ్‌రెడ్డి తన సోదరుడితో సమానులని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మండలం పురుషోత్తమాయగూడెం గ్రామంలో నరేశ్‌రెడ్డి చిత్రపటానికి సీతక్క పూలమాల వేసి నివాళులర్పించారు.

మహబూబాబాద్ రూరల్: టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చుక్కల ఉదయ్ చందర్ అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. పట్టణంలోని స్నేహనగర్ కాలనీలో గల ఉదయ్ చందర్ నివాసంలో మంత్రి సీతక్క సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. నియోజకవర్గం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, వెన్నం లక్ష్మారెడ్డి, చిట్యాల జనార్దన్, బుజ్జివెంకన్న, చల్ల లింగారెడ్డి, పాల్గొన్నారు.

కొత్తగూడ: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వట్టం సమ్మక్క కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, సారయ్య, రూప్‌సింగ్, రణధీర్, మొగిలి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

మహబూబాబాద్ రూరల్: శ్రీభక్త మార్కండేయ శివాలయ ట్రస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమ్మర్తపు మురళీ సమక్షంలో స్థానిక ఆలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్‌గా కైరంకొండ వీరన్న, ప్రధాన కార్యదర్శిగా తవుటం శ్రీనివాస్, కోశాధికారిగా వడ్డేపల్లి రాజేంద్రప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా ముల్క మురళీ, తాటిపాముల రామదాసు, కుడికాల రాజేందర్, కోమాకుల రాజేశ్వరరావు, గుర్రపు రమేష్ ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య సలహాదారులుగా అనుమాల వెంకటేశ్వర్లు, కస్తూరి మల్లయ్య, కోమటి శ్రీనివాస్, బొమ్మ వెంకటేశ్వర్లు, గోసికొండ శేఖర్, న్యాయ సలహాదారులుగా చిలకమారి వెంకటేశ్వర్లు, కార్యనిర్వహణ కార్యదర్శులుగా జంజిరాల రవికుమార్, కస్తూరి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కట్ట పుల్లయ్య, వడ్డేపల్లి నర్సయ్య, కుడికాల రమేష్ , కల్వకుంట్ల శ్రీనివాస్, కై రంకొండ ప్రభాకర్, కాముని యాకయ్య, కార్యవర్గ సభ్యులుగా యామిని రమేశ్, సోమ సహదేవ్, శ్రీరామ్ గుట్టయ్యస్వామి, నాగుల రవికుమార్, కస్తూరి రామకృష్ణ, రచ్చ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు.

ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకుంటాం



మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

డోర్నకల్: త్వరలో జరగబోయే నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకుంటామని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. సోమవారం డోర్నకల్ జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు సమస్యల పరిష్కారం కోసం డోర్నకల్‌లో కన్వీనర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, నాయకులు కాసు మారెడ్డి, దేవేందర్‌రెడ్డి, రంగారెడ్డి సాహెబ్‌అలీ, శ్రీను, మాధవరావు పాల్గొన్నారు.

వసతి గృహం ఏర్పాటు చేయాలని వినతి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న వెంకన్న

గార్ల: ఏజెన్సీ మండలమైన గార్లలో ఎస్టీ బాలుర వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అజ్మీరా వెంకన్న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గార్లలో ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని, ఎస్టీ వసతిగృహం లేకపోవడంతో తండాల నుంచి నిత్యం విద్యార్థులు సైకిళ్లపై వస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొంతమంది ఎస్టీ విద్యార్థులు ప్రతీరోజు ఇంటి నుంచి రాలేక చదువులకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, సాయికుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కేసముద్రం, ఇనుగుర్తి మండలాల స్థాయి కబడ్డీ పోటీలను కబడ్డీ టోర్నమెంట్ అధ్యక్షుడు షేక్ ఖాదర్ సోమవారం ప్రారంభించాడు. కార్యక్రమంలో టోర్నమెంట్ ప్రధాన కార్యదర్శి ఏల్పుగొండ మధుకర్, ఉపాధ్యక్షుడు గంధం రమేశ్, యాకాంబ్రం, జానీ, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందిస్తున్న సీఐ జగదీశ్

తొర్రూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సీఐ జగదీశ్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని ఎంప్లాయిస్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు. సోమవారం క్రీడాపోటీల్లో విజేతలైన క్రీడాకారులకు నగదుతోపాటు బహుమతులను అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. ఇలాంటి క్రీడా పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహించడం ద్వారా క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల నగేష్, ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య, ఇంజనీర్ మధుసూదన్, హెచ్ఎం లక్ష్మినారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు రేవూరి నర్సయ్య, వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడి ఆపాలని నాయకుల నిరసన



ధర్నా చేస్తున్న పార్టీల నాయకులు

మహబూబాబాద్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడి వెంటనే ఆపాలని వామపక్ష పార్టీల నాయకులు అజయ్‌సారథిరెడ్డి, సమ్మెట రాజమౌళి, లింగ్యా, జగ్గన్న, గుజ్జు దేవేందర్ డిమాండ్ చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడిని నిరసిస్తూ సీపీఐ, సీపీఎం, మాస్‌లైన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, పాపయ్య, సూర్యం, శ్రీధర్, వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, కోటేష్, జబ్బార్, రమేష్, నాగార్జున, రవీందర్, నాగరాజు, అశ్విని, మునిత, మల్లయ్య, శ్యాంప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నియంత్రణకు ట్రెంచ్‌లు



గుంత తీసిన రెవెన్యూ అధికారులు

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి శివారు ఆకేరు వాగులోని ర్యాంప్ నుంచి అక్రమ ఇసుక నియంత్రణ కోసం మూడు వైపుల రోడ్లకు జేసీబీతో ట్రంచ్‌లు వేసినట్లు తహసీల్దార్ నాగరాజు సోమవారం తెలిపారు. రోడ్డుకు అడ్డుగా వేసిన ట్రెంచ్‌ను పూడ్చి ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుర్గాదేవీకి పూజలు



మహబూబాబాద్ రూరల్: దుర్గాదేవీకి చీరలతో అలంకరణ

సాక్షి నెట్‌వర్క్: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం లలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించి, భక్తులు కుంకుమ పూజలు ఆచరించారు.

క్రైం కార్నర్..

పాముకాటుతో బాలుడి మృతి



రిషి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: పాము కాటుతో బాలుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని పత్తిపాకలో సోమవారం చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తిపాకకు చెందిన కొంగర కుమార్ కుమారుడు కొంగర రిషి (14) ఆదివారం రాత్రి ఇంట్లో తండ్రి వద్ద నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో రిషి తన కాలుకు ఏదో కుట్టినట్లుగా మండుతుందని తండ్రితో చెప్పాడు. వెంటనే నిద్రలేచి చూడగా మంచం వద్ద నుంచి పాము వెళ్లడాన్ని గమనించాడు. హుటాహుటిన రిషిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అలీ శవ పంచనామా నిర్వహించి పోస్ట్ మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మహిళ మెడలోనుంచి బంగారు ఆభరణాలు చోరీ

మహబూబాబాద్ రూరల్: ఓ మహిళ తన ఇంటి ముందు మనువడిని ఆడిస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన దుండగుడు ఆమె మెడలోనుంచి నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉండే రిటైర్డ్ ఉపాధ్యాయుడు మంగళపల్లి సోమయ్య సతీమణి సోమలక్ష్మి తమ మనవడిని ఇంటి ముందు ఆడిస్తూ కొంత సమయానికి ఆ బాలుడిని ఇంట్లోకి పంపాలని ఇంటి మెట్టు ఎక్కుతుంది. అంతలోనే ఓ దుండగుడు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె వెనుక నుంచి మెడలోని మూడున్నర తులాల బంగారు పుస్తెలతాడు, తులంన్నర బంగారు గొలుసును లాక్కుని వెళ్తుండగా.. సోమలక్ష్మి వారి ద్విచక్ర వాహనాన్ని కొంత దూరం వెంబడించింది. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారధిరెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, సీసీఎస్ సీఐ హత్తిరాం, ఎస్సై తాహెర్ బాబా, పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

కేసముద్రం: ప్రమాదవశాత్తు రెండు ద్విచక్రవాహనాలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రాజీవ్‌నగర్‌తండాజీపీ శివారు బిచ్యానాయక్‌తండా సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్లబండతండాకు చెందిన బాదావత్ సురేష్ కేసముద్రంస్టేషన్ నుంచి ఇంటికి వెళ్తుండగా, రంగాపురం గ్రామానికి చెందిన నరేష్ కేసముద్రంస్టేషన్‌కు వస్తున్నాడు. ఈక్రమంలో బిచ్యానాయక్‌తండా సమీపంలో ప్రమాదవశాత్తు రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో సురేష్‌కు తీవ్ర గాయాలు కాగా, నరేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. సురేష్‌ను 108లో మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి..

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మరావు సాయమ్మ అనే వృద్ధురాలు సోమవారం బైక్‌పై వస్తుండగా కారు ఢీకొని కాలు పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. దీంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించి వైద్యం అందిస్తున్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి..

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌కి చెందిన సంజీవ అనే వ్యక్తి సోమవారం బైక్‌పై గూడూరు నుంచి కేసముద్రం వైపునకు వస్తుండగా, మండల కేంద్రం సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకుపోయింది. దీంతో అతడి తలకు, కాళ్లు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో మహిళకు..

దంతాలపల్లి: మండల కేంద్రానికి చెందిన అవిలేని స్వప్న సోమవారం తన ఇంటిలో పని చేసుకుంటుంది. ఈక్రమంలో కోతుల గుంపు వచ్చి ఆమెపై దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఆటో ఢీ.. బాలుడికి..

గార్ల: సైకిల్‌పై వెళ్తున్న బాలుడిని వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో బాలుడి చెయ్యి విరిగిన సంఘటన సరిహద్దుతండా సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సరిహద్దుతండాకు చెందిన భూక్యా ఆనంద్‌నాయక్ సైకిల్‌పై వెళ్తుండగా.. గ్యామాతండాకు చెందిన భూక్యా పాప ఆటో వెనుక నుంచి ఢీకొనడంతో ఆనంద్ నాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

కురవి: మండలంలోని బలపాల గ్రామంలో సీపీఐ సీనియర్ నాయకుడు నెల్లూరు సత్తయ్య(76) సోమవారం మృతి చెందాడు. ఈమేరకు ఆయన మృతదేహంపై సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కరణం రాజన్న పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్క్‌లో నిర్వహించనున్న దసరా పండుగ ఉత్సవాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు హనుమాండ్ల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు.

భూమి పూజ

నెల్లికుదురు: మండల కేంద్రంలో మాల ముత్యాలమ్మ తల్లి గుడి నిర్మాణానికి సోమవారం జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ సోమవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, ప్రశాంత్, సంజీవ, దర్గయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

మరిపెడ రూరల్: మండలంలోని తానంచర్ల, ఎల్లంపేట గ్రామాల్లోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాపులను మండల వ్యవసాయ అధికారులు సోమవారం తనిఖీ చేశారు.

డ్వాక్రా గ్రూపుల్లో ఉన్నవారికే చీరలు ఇస్తామనడం సరికాదు

గార్ల: డ్వాక్రా గ్రూపులతో సంబంధం లేకుండా బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలకు మాత్రమే చీరలు ఇస్తామనడం సరికాదన్నారు.

సరుకుల పంపిణీ

మరిపెడ రూరల్: మండలంలోని సీతారాంతండా వరద బాధితుల కాజీపేట ఫాతిమా చర్చి విచారణ కమిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎస్సై బొలగాని సతీష్, ఎంపీఓ సోమ్లానాయక్ పాల్గొన్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్: ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు సల్లంపై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన నరసింహసరస్వతిపై చర్య తీసుకోవాలని కోరుతూ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు ముస్లింలు సోమవారం ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో ఎక్బాల్, మౌలానాలు సయీద్ అహ్మద్ రిజ్వీ, ముఫ్తీ అలంగీర్, అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



గార్ల: సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలను స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ మంగమ్మ చేతుల మీదుగా సోమవారం మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై జీనత్‌కుమార్, డీటీ జర్పుల సుధాకర్‌నాయక్, ఆర్ఐ రామకృష్ణ, ఏపీఎం నరేంద్రకుమార్, కార్యదర్శి కిషన్ పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మాజీ జెడ్పీటీసీ భూక్య సంగీత జెడ్పీ నిధుల నుంచి రూ.1.80లక్షల విలువ చేసే హైమాస్ట్ లైట్లు సోమవారం ఏర్పాటు చేసినట్లు దసరా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

డంపింగ్ యార్డ్ తొలగించాలి

తొర్రూరు రూరల్: తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలోని చెత్తా చెదారాన్ని, ప్రతిరోజు తరలించే డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ హచ్చుతండాకు చెందిన గిరిజనులు సోమవారం ఆందోళన చేపట్టారు. డంపింగ్ యార్డ్‌తో దుర్వాసన వస్తుందని, ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ఆందోళన చేస్తున్న వారిని అదుపులోకి తీసుకొని, చెత్త వాహనాలను డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

వ్యాయామంతో ఆరోగ్యం

తొర్రూరు: ప్రతి వ్యక్తి వ్యాయామం చేస్తేనే ఆరోగ్యవంతంగా ఉంటామని వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వింజమూరి సుధాకర్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని యతిరాజారావు పార్క్‌లో వాకర్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కేక్‌కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మోడెం సోమనర్సయ్య, ప్రతినిధులు యాకయ్య, మహేష్, రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పూజలు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి వారిని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందులు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు నరహరి, మన్యూప్యాట్నీ, బోడ శ్రీను, నూతక్కి నర్సింహరావు పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డి కోలుకోవాలని మోకాళ్లపై ప్రదక్షిణలు



తొర్రూరు రూరల్: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ఆరోగ్యం త్వరగా కొలుకోవాలని కోరుతూ పాలకుర్తి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం వద్ద మోకాళ్లపై ఓ వీర అభిమాని సోమవారం ప్రదక్షిణ చేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు.

దివ్యాంగుడికి అండగా..

చిన్నగూడూరు: మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన మెట్టు వెంకన్న, కమలమ్మ దంపతుల కుమారుడు మెట్టు రాజు పుట్టుకతో దివ్యాంగుడు. నడకకు దూరమైన బాలుడి పరిస్థితిని ఇన్‌స్టాగామ్ రఘుకి గ్రామ ప్రజలు సమాచారం అందించారు. స్పందించిన కురవి మండలానికి చెందిన గంగరబోయిన రఘు విదేశీయురాలు రిషిక సహాయంతో బాలుడికి రూ.5వేల విలువైన వీల్ చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో యువకులు కార్తీక్, యాకన్న పాల్గొన్నారు.

ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

కురవి: సీపీఎం జిల్లా నాయకుడు, బలపాల మాజీ సర్పంచ్ పిట్టల దర్గయ్య ఆశయ సాధన కోసం కార్యకర్తలు ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గొల్లపల్లి నాగయ్య, సీపీఎం రాష్ట్ర నాయకుడు జి.రాములు పిలుపునిచ్చారు. సోమవారం పిట్టల దర్గయ్య సంతాప సభ, స్థూపం ఆవిష్కరణ సభ పిట్టల వెంకన్న అధ్యక్షతన జరగగా వారు మాట్లాడారు. దర్గయ్య గ్రామంలో అనేక ప్రజాపోరాటాలు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మండల కార్యదర్శి మలేడి కోటయ్య, నాయకులు రాజు, వెంకన్న, వీరయ్య, అశోక్, శ్రీనివాస్, వీరన్న, సుధాకర్ పాల్గొన్నారు.

ఏఈఓ ఉద్యోగం సాధించిన శ్రావణి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పట్టణంలో వెంకటేశ్వర బజారుకు చెందిన కటకం సతీష్, సుభద్ర దంపతుల ప్రథమ కుమార్తె కటకం శ్రావణి పంచాయతీరాజ్ శాఖలో ఏఈఓగా ప్రభుత్వ ఉద్యోగం సాధించింది.

నేడు జాబ్‌మేళా

డోర్నకల్/గంగారం: మహబూబాబాద్‌లోని ఏబీ ఫంక్షన్ హాలులో నేడు జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ సోమవారం తెలిపారు.